క్లుప్తంగా

కళాజాత ప్రదర్శన



కళాజాత ప్రదర్శిస్తున్న బృంద సభ్యులు

దెందులూరు: కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు గురువారం ఏలూరు ఆశ్రమ సెంటర్ వద్ద పాలగుడు గ్రామంలో కాలుష్య నియంత్రణ మండలి రాజధాని ఆఫీస్ ఆఫీసర్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం ఆవశ్యకతను కళాకారుల బృందం ఎం.ప్రశాంత్‌కుమార్, తిరుపతి కుమార్, బృందం కళాజాత ప్రదర్శన నిర్వహించారు.

ఇంటింటా చెత్త సేకరణ

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. చెత్త రహిత గ్రామంగా చేబ్రోలును తయారు చేయడానికి ఎంపిక చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో 9 రోజులుగా గ్రామంలో పని చేస్తున్న విషయం విదితమే. గ్రామంలో ప్రజలు సహకరించాలని శ్రీనివాసరావు కోరారు. తడిచెత్త పొడిచెత్తను కూడా విడదీస్తున్నారు. కార్యక్రమంలో చేబ్రోలు సర్పంచి లక్ష్మీసునీత, ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, తదితరులు పాల్గొన్నారు.

మానుచెట్ల నరికివేత



నరికి వేసిన మానుచెట్లు

ఉంగుటూరు: మండలంలో అడొచ్చిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు నరికేస్తున్నారు. గొల్లగూడెం నుంచి నిడమర్రుకు కొత్తలైను సుమారు పదిహేను కిలో మీటర్లు వేస్తున్నారు. ఆ లైనులో అడొచ్చిన మాను చెట్లను గుత్తేదారు నరికేసి సొమ్ములు చేసుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆ చెట్లు పెంచారు. గొల్లగూడెం సబ్‌స్టేషన్ నుంచి నిడమర్రులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లైన్లు వేస్తున్నారు. ప్రభుత్వం ఓ వైపు చెట్లు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి అనే నినాదాలు మరో వైపు ఇలా చెట్లు నరికేయడం ఏమిటని పర్యవరణ ప్రియులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రభాకరరావును వివరణ కోరగా చెట్ల కొమ్మలు మాత్రమే నరకాలని, మానుచెట్లు నరికితే వారిపై చర్యలు తీసుకుంటామని విలేకరులకు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని విద్యాశాఖ మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ ఎం.వెంకటప్పయ్య తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఏడీ వెంకటప్పయ్య మాట్లాడుతూ వంట సహాయకులు ప్రభుత్వం రూపకల్పన చేసిన డొక్కా సీతమ్మ బడి భోజన కార్యక్రమాన్ని మోనూ ప్రకారం శుచి, శుభ్రతతో ఆరోగ్యకరంగా ఉండేలా చూడాలన్నారు.కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్లు మహమ్మద్ గౌస్, బెల్లపు కుమార్, మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, ఎండీఎం వంట సహాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల మద్దతు ధర కల్పనలో విఫలం

కుక్కునూరు: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐయూకేఎస్ జాతీయ కమిటీ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి విమర్శించారు. గురువారం అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన కుక్కునూరు ప్రజాపంథా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 2025–26 పంట కాలానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 14 రకాల పంటలకు ధరలు నిర్ణయిస్తూ అనేక రాష్ట్రాల సిఫార్సులను పక్కన పెట్టి తన కార్పొరేట్లకు అనుకూలంగా ఎంఎస్‌పీ నిర్ణయించిందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వరి క్వింటాకు సాధారణ రకం రూ.3 వేలు, ఏ గ్రేడ్ రకానికి రూ.3,200, ప్రత్తికి రూ.8,521, మొక్కజొన్నకు రూ.2,900, వేరుశెనగకు రూ.8 వేలు, కందులకు రూ.9,200, పెసర్లకు రూ.9 వేలు, హైబ్రిడ్ జొన్నలకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు పేరుతో విలీన మండలాల్లో మూసివేసిన వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకులు సిరికొండ రామారావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే జరిమానా

- వాహనదారులు తస్మాత్ జాగ్రత్త
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- వాహన తనిఖీలను ముమ్మరం చేసిన పోలీసులు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

దెందులూరు: పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా ద్విచక్ర వాహనాలు, కార్లు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహన రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జఠిలమవుతోంది. సంబంధిత శాఖలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం లేదు.

నిబంధనలు బేఖాతరు

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. కానీ ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. లైసెన్స్ రవాణా, పోలీస్ శాఖల కోసమే అని చాలా మంది భావన. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్లపైకి వచ్చే వారే సగం ప్రమాదాలకు కారణమని గణాంక లెక్కలు చెబుతున్నాయి. దీనికి తోడు కొందరు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. వారు అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

లైసెన్సు పొందండిలా..

వాహనం నడపటానికి డ్రైవింగ్ లైసెన్స్ చాలా అవసరం. దీన్ని మంజూరు చేయడానికి రవాణాశాఖ పరీక్షలు నిర్వహిస్తుంది. దీనిలో మొదటిది లెర్నర్ లైసెన్స్, మైనారిటీ తీరిన తర్వాత లైసెన్స్ పొందేందుకు నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రహదారి నిబంధనలు, పలు సింబల్స్, హెచ్చరికల బోర్డులు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం రవాణా శాఖ కార్యాలయంలో కంప్యూటర్‌లో పరీక్ష రాయాలి. ఈ పరీక్ష ఉత్తీర్ణులైన 40 రోజుల లోపు పర్మినెంట్ లైసెన్స్ పొందాలి. ఈ దశలో రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణలో స్వయంగా మన వాహనంపై డ్రైవింగ్ చేయాలి. అనంతరం లైసెన్స్ మంజూరు చేస్తారు.

ప్రయోజనాలు ఇవే..

వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉంటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి కండిషన్ ఎంత ముఖ్యమో, బీమా అంతే అవసరం. ప్రమాదాల సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహనం ఇచ్చిన సంబంధిత వాహన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. వాహనానికి పూర్తి స్థాయిలో ప్రమాద బీమా ఉన్నా లైసెన్సు లేని వాహన చోదకుడికి అది వర్తించదు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి

కొందరు తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తుంటారు. వారు నడవడం చూసి ఆనందం వ్యక్తం చేస్తుంటారు. కానీ దీని వలన జరిగే నష్టాన్ని ఊహించరు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనం ఇవ్వడం నేరం.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులు సంయుక్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. లైసెన్సు లేని వాహన చోదకులను గుర్తించి జరిమానా విధిస్తున్నాం. అంతే కాకుండా కేసులు నమోదు చేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ కూడళ్లలో పెద్ద ఎత్తున అవగాహన సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నాం.

–ఆర్.శివాజీ, ఎస్సై

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



పెదపాడు: మొక్కలు నాటుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి



భీమడోలు: మొక్కలు నాటుతున్న విద్యార్థులు



పెదవేగి: పర్యావరణంపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



దెందులూరు: మొక్కలు నాటుతున్న అధికారులు

పెదపాడు: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వసంతవాడ, తోటగూడెం, పెదపాడు గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో అమీలు జమా, పోలిపర్తి కన్నారావు, బొప్పిడి కాశీబాబు, బొప్పన బాబ్జి, మాజీ ఎంపీపీ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

భీమడోలు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ పర్యావరణాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.జయశ్రీ, టీచర్ పంతుల లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ హితమే మన లక్ష్యం కావాలి

పెదవేగి: అగ్రో సంస్థ కోకో లైఫ్ ఆధ్వర్యంలో కొప్పులవారిగూడెంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోండలీజ్ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర, సస్టైనబుల్ కో–ఆర్డినేటర్ సీహెచ్ చిన్నబాబు ఇతర ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో అగ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయప్రసాద్, ఎం.రమేష్, పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ గణేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఉంగుటూరు: పర్యవరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం నారాయణపురంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకనంద, పందిరాంబాబు, ఏఎంసీ చైర్మెన్ సూరత్తుల జ్యోతి అయప్ప, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం

దెందులూరు: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వల్లపట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ కె.శ్రీదేవి, తహసీల్దార్ డి.సుమతి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో తాగునీరు

- మంచినీటి చెరువులో పశువుల జలకాలు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న స్థానికులు



అడవికొలను రక్షిత మంచినీటి పథకం చెరువులో జలకాలాడుతున్న గేదెలు

నిడమర్రు: మండలంలో మేజర్ గ్రామ పంచాయితీ అడవికొలను గ్రామం. ముఖ్యమైన కూటమి నేతలు ఉన్న గ్రామం. కానీ గ్రామాభివృద్ధిపై వారందరికీ చిన్న చూపే అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారణం గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించే ప్రధాన రక్షిత మంచినీటి పథకం తూర్పు చెరువు కలుషితమవుతున్నా కూటమి నేతలకు కనిపించకపోవడం. చెరువు చుట్టూ గట్లపై నుంచి పశువులు దిగి జలకాలాడుతూ మంచినీటి చెరువును దూళ్ల చెరువుగా మార్చేస్తున్నా పట్టించుకునే వారే లేవరని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయితీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రక్షిత మంచినీటి పథకం నీరు సెంటర్‌లో ఉన్న ఒవర్ హెడ్ ట్యాంక్‌కు, ఎస్సీ కాలనీ ఒవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు పంపిణీ చేస్తున్నారు. ఈ 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు నుంచి సుమారు 620 వరకూ ప్రైవేట్, పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. ఇంత ప్రధాన చెరువును కలుషితం నుంచి కాపాడాలని పాలకులను స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో చెరువు అభివృద్ధి

ఈ తూర్పు చెరువుకు కరకోడు పంట కాలువ నీటితో చెరువు నీటిని నింపుతారు. అయితే ఈ పంట కాలువ నుంచి చెరువుకు నీరు వచ్చే మార్గంలో చేపలు, రొయ్యల చెరువుల్లో పట్టుబడులు పూర్తయ్యి కలుషిత నీటిని వదిలేయడంతో ఆ నీరు తాగునీటిని కలుషితం చేసేది. దీంతో రూ.13 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధికారం చేపట్టిన 7 నెలల్లో ఈ చెరువును ప్రక్షాళన చేశారు. అనంతరం పైప్‌లైన్ ద్వారా చెరువు నీటిని నింపేందుకు త్రీఫేజ్ విద్యుత్ సప్లై రూ.20 లక్షలతో మురుగు డ్రెయిన్ వ్యవస్థను నిర్మించారు. త్రీఫేజ్ విద్యుత్ సప్లైతో కరకోడు నుంచే విద్యుత్ మోటర్ల ద్వారా చెరువును నింపేలా చర్యలు చేపట్టారు. చెరువు చుట్టూ రక్షణ గోడ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో సాంకేతిక కారణాలతో అలస్యమైనట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు.

పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు



స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇప్పటికే అనేక సార్లు మంచినీటి చెరువుల్లో గేదెలను కడుగుతున్నారని ఫిర్యాదు చేశాం. కొంత మంది ఉదయం సాయంత్రం పశువులను చెరువులోకి వదిలేస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు.

–గోలి తాతపండు, అడవికొలను

కలుషిత నీటితో అనారోగ్యం



పశువుల మల మూత్రాలు మంచినీటి చెరువులో కలవడం వలన బ్యాక్టీరియా వంటివి నీటిలో కలిసి తాగునీరు కలుషితమవుతుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత పాలకులకు ఉంది. చెరువులోకి పశువులను వదిలే వారికి నోటీసుల ద్వారా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

–నిమ్మల సుబ్రహ్మణ్యం, అడవికొలను

మొక్కలు నాటేందుకు అనుమతి ఇవ్వండి



యర్రమళ్ల వీఎస్ఎస్‌లో మొక్కలు చనిపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం

ఉంగుటూరు: చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడానికి అనుమతి ఇవ్వాలని యర్రమళ్ల వన సంరక్షణ సమితి అధ్యక్షుడు దొడ్డి మోహనరావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. 2002లో కేటాయించిన 20 హెక్టార్లలో 25 వేల మొక్కలు నాటితే పది వేల మొక్కలు చనిపోయాయని తెలిపారు. 2003లో 15 హెక్టార్లలో 15 వేల మొక్కలు నాటితే 6800 మొక్కలు చనిపోయాయని, చనిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలు స్వయం కృషితో నాటడానికి అనుమతి ఇవ్వాలని మోహనరావు కోరారు. 2004లో 4 హెక్టార్లలో 2013లో 10 హెక్టార్లలో పెరిగిన జామాయిల్ మొక్కలు నరికేందుకు అనుమతి ఇవ్వాలని దొడ్డిమోహనరావు కోరారు. ఈ కాపీలను అటవీ శాఖ అధికారులకు ఇస్తామని మోహనరావు వివరించారు.

యోగా నిత్యకృత్యం కావాలి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

భీమడోలు: ప్రతి ఒక్కరి జీవితంలో యోగా నిత్య కృత్యం కావాలని భీమడోలు పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్ అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ యోగా మాసోత్సవంలో భాగంగా మండల స్థాయిలో నాల్గో రోజైన గురువారం 10 నుంచి 18 ఏళ్ల లోపు, 19 నుంచి 35 ఏళ్ల లోపు వారికి యోగాసనాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల ఇన్‌చార్జి డీఈ వేణుగోపాల్ పర్యవేక్షించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ బి.రమాదేవి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి, డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్, కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఉపాలయమైన శ్రీ దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

భీమడోలు: గుండుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పోటీల్లో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం పాశం పాండురంగారావు, కాబోతుల సోమేశ్వరరావు, వి.వెంకట్రావు, పి.వెంకట్రావు, టీచర్లు ఆనందనబాబు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

దెందులూరు: విద్యార్థులకు అన్ని అంశాల్లో ప్రావీణ్యం ఉండాలని పోతునూరు గ్రంథాలయ అధికారి జి.రాంబాబు అన్నారు. గురువారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సీనియర్, జూనియర్ విభాగం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం గ్రంథాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామన్నారు.

ఎక్సైజ్ దాడులు

కుక్కునూరు: మండలంలోని మారేడుబాక గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. గ్రామానికి చెందిన గుగులోత్ రాంబాబు వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: సీతంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.18 గంటలకు పునర్నిర్మించిన ఆలయం ఎదుట ఏకశిలా ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. గణపతి, ఉమా సహిత రామలింగేశ్వర, నందీశ్వర, చండీశ్వర, నవగ్రహ దేవతామూర్తులతో పాటు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆరువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన చేర్పాటుచేశారు. గ్రామస్తులంతా ఐక్యంతో ఉత్సవాలలో పాల్గొనడం స్ఫూర్తిదాయకం అని రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సుమారు 80 ఏళ్ల నాటి శివాలయాన్ని గ్రామస్తుల సౌజన్యంతో పునఃనిర్మించారని, సర్పంచ్ తోటకూర పద్మావతి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, మధ్యాహ్నపు యేసు తెలిపారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడికి కృషి



కేవీకే ద్వారా పంపిణీ చేసిన బ్లాక్ బెంగాలీ మేకలను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: వ్యవసాయ సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధనకు కృషి చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని కాపవరం, పందుగూడెం, బండార్లగూడెం గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం (వెంకటరామన్నగూడెం) ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు రైతులకు మరింత చేరువ అవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2025 సీజన్‌లోని ముందస్తు వ్యవసాయ సలహాలు, సూచనలు, పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. బండార్లగూడెంలో కేవీకే ద్వారా ఇటీవల 11 మంది లబ్ధిదారులకు ఇచ్చిన బ్లాక్ బెంగాలీ రకం మేకలు ఒక కాన్పుకు 4 పిల్లలకు జన్మనిచ్చాయని శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవీ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేకలను బాషా పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మేరీ రాణి, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లలిత సుధ, కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుచ్చిబాబు, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రేఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, పశువర్ధకశాఖ డాక్టర్ విజయ్‌కుమార్, స్థానిక వ్యవసాయ సహాయకులు ఎస్ భవాని పాల్గొన్నారు.